క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప శివారు ఎండపల్లి జంక్షన్ వద్ద ఎంపీటీసీ దాకే నాగమహేశ్వరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు ప్రారంభించారు. ప్రస్తుత వేసవిలో పాదచారులు, వాహన చోదకుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వాహనదారులు ఈ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తొలిరోజు బాటసారులు, వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాకే రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గేటు మరమ్మతులతో వాహనాలకు అంతరాయం



సామర్లకోటలో రైల్వే గేటుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో ఉన్న ఎల్‌సీ 426 గేటు విరిగిపోవడంతో రైల్వే సిబ్బంది ఆదివారం సాయంత్రం మరమ్మతులు చేశారు. దాంతో ఈ గేటు మీదుగా జరిగే రాకపోకలకు కొంత మేర అంతరాయం ఏర్పడింది. ఇప్పటికే రైల్వే గేటు మీదుగా బారీ వాహనాల రాకపోకలను నిషేధించారు. పిఠాపురం రోడ్డులో నివాసం ఉంటూ కాకినాడకు రాక పోకలు చేసే వారికి ఇదే దగ్గరి దారి. దాంతో ఆయా ప్రాంతాల ప్రజలు గేటు వేసి ఉన్నా కొంత సమయం వేచి ఉండి రాక పోకలు సాగిస్తారు. ఈ గేటు మరమ్మతులతో సుమారు గంట సేపు చిన్న వాహనాల రాక పోకలకు అందరాయం ఏర్పడింది.

జిల్లాస్థాయి అవార్డులకు రెండు పంచాయతీల ఎంపిక



రమణక్కపేట గ్రామం

కొత్తపల్లి: మండలంలోని రమణక్కపేట, గోర్స గ్రామాలు జిల్లాస్థాయి గ్రామ పంచాయతీ అవార్డులకు ఎంపికైనట్లు ఈఓపీఆర్డీ భాస్కరరావు ఆదివారం తెలిపారు. పేదరికం నిర్మూలన, ఆరోగ్యం, బాలహిత పంచాయతీ, నీటి సమృద్ధి, స్వచ్ఛత, స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాలు, లింగ సమానత్వ తదితర తొమ్మిది అంశాలపై ప్రభుత్వం పంచాతీయలకు అవార్డు ప్రకటిస్తుంది. గోర్స పేదరికంలేని మెరుగైన జీవనోపాధి పంచాయతీ, రమణక్కపేటను బాలహిత అంశంలో అవార్డులకు ఎంపికైనట్టు జిల్లా పరిషత్ కార్యనిర్వహణాధికారి ఎస్వీ సత్యనారాయణ తెలిపారు. పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయా పంచాయతీలకు సోమవారం జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అవార్డులు అందజేస్తారన్నారు. అవార్డుకు ఎంపికైన పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులను సత్కరిస్తారని చెప్పారు. అవార్డులకు ఎంపిక కావడంపై ఆయా గ్రామాల సర్పంచులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

సుబ్బారావుకు పరామర్శ



దవులూరి సుబ్బారావును పరామర్శించిన బొడ్డు వెంకటరమణచౌదరి తదితరులు

సామర్లకోట: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు తండ్రి దవులూరి సుబ్బారావును టీడీపీ నాయకుడు బొడ్డు వెంకటరమణ చౌదరి ఆదివారం పరామర్శించారు. ఈనెల 17న దవులూరి సుబ్బారావు పాము కాటుకు గురి కాగా ఏడీబీ రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో వేట్లపాలెం మాజీ ఉపసర్పంచ్ వల్లూరి శ్రీనివాసు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ పాల్గొన్నారు.

'బార్' కార్యవర్గానికి సన్మానం

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో కాకినాడ బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఆదివారం సన్మానించారు. సంఘం అధ్యక్షుడు ముత్తింటి విశ్వేశ్వరరావు, కార్యదర్శి చెక్కా శ్రీనివాస్, కోశాధికారి బహదూర్ వెంకటరెడ్డిలను అడబాల ట్రస్ట్ చైర్మన్ అడబాల రత్నప్రసాద్ సన్మానించారు. న్యాయవాదులు యనమల రామం, కె.శ్రీరామ రాజు, డాక్టరు వెంకటరమణ, డాక్టరు శిరీష, మాణిక రెడ్డి సత్యనారాయణ, శ్రీనగేష్, చింతపల్లి సుబ్బారావు, రేలంగి బాపిరాజు, అడబాల సత్యనారాయణ, ఉంగరాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చెరువుగా మారిన సామర్లకోట బస్సు కాంప్లెక్స్



సామర్లకోట మండలంలో ఈదురుగాలులకు పడిపోయిన వరి పంట

అంతా జలమయం



సామర్లకోట సత్యనారాయణపురం రోడ్డు మీదుగా ప్రవహిస్తున్న మురుగునీరు



సామర్లకోటలో నీట మునిగిన పెద్దాపురం రోడ్డు

- ఈదురు గాలులతో భారీ వర్షం
- చల్లబడిన వాతావరణం
- వేసవి తాపం నుంచి సేద తీరిన జనం

సామర్లకోట: పట్టణ, మండల పరిధిలోని అన్ని ప్రాంతాలు ఆదివారం కురిసిన భారీ వర్షానికి జలమయం అయ్యాయి. ఈదురు గాలులు, పిడుగులతో ఉదయం కుంభవృష్టి కురిసింది. రెండు నెలల పాటు విపరీతమైన ఎండలతో విలవిలాడిన ప్రజలకు ఈ వర్షం సేద తీర్చింది. దీంతో ఆదివారం వాతావరణం చల్లబడింది. కొన్ని ప్రాంతాల్లో చెట్టు కొమ్మలు విద్యుత్తు వైర్లు, డ్రైన్లలో పడిపోయాయి. దాంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. బస్సు కాంప్లెక్స్, రైల్వే స్టేషన్, సత్యనారాయణ పురం, జయలక్ష్మి థియేటర్, సంగీతరావుపేట, వీర్రాఘవపురం, కొత్తూరు, భాస్కర్‌నగర్, సాయినగర్, గణేష్ కాలనీలు జలమయమయ్యాయి. డ్రైన్ల ఆక్రమణతో ఈ పరిస్థితి ఏర్పడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. చేతికి అందే పంట కోతకు వచ్చే సమయంలో పడిపోయిందని వీకే రాయపురం, పిఠాపురం రోడ్డులోని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

నేలవాలిన వరి పంట

దాళ్వా వరి పంట కోతకు వచ్చిన సమయంలో ఒకసారిగా ఈదురు గాలులతో కూడిన వర్షానికి పంట ఒరిగిపోయింది. దాంతో మిషన్‌లో వరి కోత కొంత మేరకు కష్టం అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలంలో ఉన్న నీరు కిందికి పాయేలా రైతులు ఏర్పాట్లు చేసుకోవడంతో పంట నీట ముంపు నుంచి రక్షణ ఏర్పడింది.

ముగిసిన నూకాలమ్మతల్లి ఉత్సవాలు

అలరించిన కోలాటం, చిన్నారుల నృత్యాలు



ఆలయంలో కోలాటం ప్రదర్శిస్తున్న చిన్నారులు

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లో కొలువైన నూకాలమ్మ ఆలయంలో కొత్త అమావాస్య నుంచి నిర్వహిస్తున్న ఉత్సవాలు ఆదివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా అమ్మవారిని భక్తులు భారీ సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో చిన్నారులతో కోలాటం, నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఉత్సవాల ముగింపు రోజున ఆలయ కమిటీ, పంచారామ క్షేత్ర దీపారాధన సేవా సంఘం నూకాలమ్మ పారాయణ కమిటీ సభ్యులు భక్తులకు సేవలందించారు. ఆలయ ప్రధానార్చకుడు దేవళ్ల సాయికుమార్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పెనుమర్తి వీరవెంకట సత్యనారాయణ, మార్ని శ్రీనివాసు, బొమ్మాలరావు, యార్లగడ్డ శ్రీనివాసు, సత్తి అరుణ భక్తులకు సేవలందించారు.

మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు



మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు తదితరులు



మహాలక్ష్మి అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పిఠాపురం: పట్టణంలో వేంచేసిన శృంగేరి శంఖర మఠం శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం అమ్మవారికి కలశ పూజలు, కుంకుమార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 25వ తేదీ వరకూ ఈ ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నారు.

ఒమ్మంగి, రాచపల్లి గ్రామాల్లో పోలీసు పికెట్

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగి, రాచపల్లి గ్రామాల్లో ఇరువర్గాలు ఒకరిపై మరొకరు కేసులు పెట్టుకున్న నేపథ్యంలో ఆదివారం పోలీసు పికెట్ నిర్వహించారు. స్థానిక సీఐ కె.కిషోర్‌బాబు ప్రత్తిపాడు, అన్నవరం, ఏలేశ్వరం ఎస్సైలు పవన్‌కుమార్, సోబన్‌కుమార్, సతీష్‌బాబులతో కలిసి గ్రామాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. ఎటువంటి అల్లర్లు చోటుచేసుకోకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. రహదారులపై పోలీసులు గస్తీ కాస్తున్నారు. శాంతిభద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నట్లు సీఐ కిషోర్‌బాబు తెలిపారు.

ఉండమ్మా బొట్టు పెడతా



శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో భక్తురాలికి తిరునామాలు దిద్దుతున్న ఈఓ సౌజన్య



భక్తుడికి తిరునామాలు దిద్దుతున్న ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ రెడ్డెం జనార్దనరావు

- ఆలయాల్లో కట్టు, బొట్టు తప్పనిసరి
- పిఠాపురంలోని ప్రముఖ ఆలయాల్లో అమలు

పిఠాపురం: ఆలయాల్లో కట్టు, బొట్టు సంప్రదాయాలను ఆచరించడం ఇక తప్పనిసరి అంటున్నారు దేవదాయ, ధర్మాదాయశాఖ అధికారులు. సనాతన ధర్మం నుంచి వచ్చిన ఆచారాలకు ప్రాణం పోయడానికి అధికారులు నడెం బిగించారు. సంస్కృతి సంప్రదాయాలకు నిలయాలైన హిందూ దేవాలయాలకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే అన్నవరం, చిన తిరుపతి వంటి ఆలయాల్లో వస్త్రధారణతో పాటు బొట్టు విషయంలో కఠిన నియమాలు అమలు చేస్తున్నారు. కాగా వీటిని అన్ని దేవాలయాల్లోనూ అమలు చేయాలని నిర్ణయించారు. పలు ఆలయాల్లో వస్త్ర ధారణ, బొట్టు విషయంలో నిర్దిష్ట నియామాలు అమలు చేస్తున్నారు. పిఠాపురంలోని ప్రముఖ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించే భక్తులు ఇక నుంచి తిరునామాలు ధరించాల్సిందే. అభిషేకాలు, అర్చనల్లో పాల్గొనే భక్తులకు సాంప్రదాయ వస్త్రధారణను తప్పనిసరి చేస్తూ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పిఠాపురం శ్రీపాద, శ్రీవల్లభ మహా సంస్థానంలో ఇప్పటికే తిరునామాలు ధరించడం ప్రారంభించగా పాదగయ క్షేత్రంలోనూ ఈ నియమాన్ని పాటించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో ఈఓ సౌజన్య భక్తులకు తిరునామాలు ధరింపచేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ రెడ్డెం జనార్దనరావు ఈ సాంప్రదాయాన్ని కట్టుదిట్టంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు నామాలు పెట్టేలా ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు చేశారు. పాదగయ క్షేత్రంలో ఈ కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించనున్నట్టు ఆలయ ఈఓ శ్రీనివాస్ తెలిపారు.

గోధుమ లోడుతో కార్మికులకు పని



గూడ్స్ వేగన్ల నుంచి దిగుమతి అవుతున్న గోధుమలు

సామర్లకోట: స్థానిక రైల్వే గూడ్స్ షెడ్ వద్ద 42 గూడ్స్ వేగన్లలో గోధుమలు వచ్చాయి. పెద్దాపురం లలితా రైస్ మిల్లు యాజమాన్యం గోధుమ పిండి పరిశ్రమను ఏర్పాటు చేయడంతో ఆ పరిశ్రమకు మధ్యప్రదేశ్ నుంచి సామర్లకోటకు గోధుమల లోడ్ వచ్చింది. దాంతో ఎగుమతి దిగుమతి కూలీలకు, లారీ ఓనర్స్ అసోసియేషన్‌లో లారీ యజమానులకు పని లభించింది. 42 వేగన్లలో 2,200 మెట్రిక్ టన్నుల గోధుమలు వచ్చినట్లు రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ తెలిపారు. లలితా రైసు మిల్లు యజమానికి సొంతంగా లారీలు ఉండటంతో లారీ అసోసియేషన్ నిబంధనల మేరకు 50 శాతం అసోసియేషన్‌కు ఇవ్వాలనే నిబంధనను పాటిస్తున్నట్లు లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పబ్బినీడి దుర్గాప్రసాద్ తెలిపారు. కాకినాడ రోడ్డులో ఫ్లై ఓవర్ బ్రిడ్జి చివరిలో ఉన్న గూడ్స్ షెడ్‌లోనికి లారీల రాక పోకలు సందర్భంగా ఆ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. లోడింగ్ ఉన్న సమయంలో ఆ ప్రాంతంలో పోలీసులు విధులు నిర్వహించే విధంగా చూడాలని స్థానికులు కొరుతున్నారు.

నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

కొత్తపల్లి: స్థానిక ఊర చెరువు సెంటర్‌లోని వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని విష్ణు హాస్పటల్ అధినేత, జనసేన పార్టీ నాయకుడు పిల్లా శ్రీధర్ డిమాండు చేశారు. ఈ మేరకు ఆదివారం ఆ పార్టీ నేతలు, కాపు నాయకులతో కలిసి ధ్వంసమైన విగ్రహం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంగవీటి మోహనరంగా ఒక కులానికి చెందిన వ్యక్తి కాదన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన రంగా విగ్రహాన్ని ధ్వంసం చేయడం దారుణమన్నారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని కోరారు. కార్యక్రమంలో గంధం గంగాధర్, మోకా వెంకటరమణ పాల్గొన్నారు.

భావనారాయణ స్వామి కల్యాణోత్సవాలకు అంకురార్పణ

కాకినాడ రూరల్: జిల్లాలో పురాతన ప్రసిద్ధి గాంచిన నారాయణ క్షేత్రం సర్పవరంలోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయంలో కల్యాణోత్సవాలకు ఆదివారం అంకురార్పణ జరిగింది. మే నెల 1న స్వామివారి దివ్య కల్యాణం సందర్భంగా ఈ నెల 29 నుంచి మే 6 వరకు ఉత్సవాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం పందిరి రాట వేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పుల్ల నారాయణరావు, ఈఓ భీమశంకరరావు, సర్పంచ్ శీలం చిన్నా, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, గ్రామ నాయకులు పుల్ల చందు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ఖోఖో టోర్నీలో కానిస్టేబుల్ ప్రతిభ



ఖోఖో టోర్నమెంట్‌లో ప్రతిభ చూపిన కానిస్టేబుల్ అప్పారావును అభినందిస్తున్న డీఎస్పీ మురళీమోహన్

ప్రత్తిపాడు: ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో ఇటీవల జరిగిన ఆల్ ఇండియా పోలీస్ ఖోఖో టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున పాల్గొన్న ప్రత్తిపాడు కానిస్టేబుల్ జి.అప్పారావు తృతీయ స్థానంలో నిలిచాడు. జాతీయ స్థాయిలో పోటీల్లో ప్రతిభ చూపిన కానిస్టేబుల్ అప్పారావుకు రాష్ట్ర డీజీపీ కె.రాజేంద్రరెడ్డి నగదు రివార్డు, వార్షిక ఇంక్రిమెంట్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ పోలీసుల తరపున రూ.లక్ష నగదు బహుమతి ప్రకటించారు. ఈబహుమతిని కానిస్టేబుల్ అప్పారావుకు జిల్లా ఎస్పీ అందజేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా ఖోఖో టోర్నమెంట్ విజేత అప్పారావును పెద్దాపురం డీఎస్పీ సుంకర మురళీమోహన్, ప్రత్తిపాడు సీఐ కె.కిషోర్‌బాబు, ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్ తదితరులు అభినందించారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్షలు



వి.కొత్తూరు గురుకుల పాఠశాలలో పరీక్షలను పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపాల్ నిర్మల కుమారి

తుని రూరల్: మండలంలో వి.కొత్తూరు, లోవకొత్తూరు గ్రామాల్లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో ఐదు, ఇంటర్మీడియెట్ తరగతుల్లో (ఏపీబీఆర్ఏజీ సెట్) ప్రవేశ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం పది గంటలకు జరిగిన ఐదో తరగతి పరీక్షకు వి.కొత్తూరులో 198 మందికి 172 మంది, లోవకొత్తూరులో 195 మందికి 172 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంటర్మీడియెట్ మొదట సంవత్సరం ప్రవేశ పరీక్షకు వి.కొత్తూరులో 197 మందికి 182 మంది, లోవకొత్తూరులో 65 మందికి 63 మంది విద్యార్థులు హాజరైనట్టు ఆయా విద్యాలయాల ప్రిన్సిపాల్స్ నిర్మల కుమారి, రాజు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

పుస్తకాలు విజ్ఞాన ద్వారాలు



విజేతలకు బహుమతులు అందజేసిన కృష్ణశ్రీ

సామర్లకోట: పుస్తకాలతో మంచి విజ్ఞానం కలుగుతుందని, పుస్తకాలే విజ్ఞానానికి ద్వారాలని ప్రముఖ కవి, బాలమందిరం కన్వీనర్ అంగర కృష్ణశ్రీ అన్నారు. మాధవపట్నం జమునానగర్‌లో ఆదివారం సాయంత్రం పుస్తక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందం ర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పిల్లలు పుస్తకాలతో గడపాలన్నారు. ఈ మేరకు పుస్తకాల ప్రాధాన్యాన్ని వివరించారు. బాలమందిరంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. పుస్తక పఠనపై సమీక్ష నిర్వహించారు. విందు భోజనం కథను నాటకంగా మార్చి విద్యార్థులతో ప్రదర్శన ఇప్పించారు. విద్యార్థులకు పుస్తకాలపై వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



నడకుదురు సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్

కరప: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్దరించి, కార్మికులను ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ అన్నారు. నడకుదురులో ఆదివారం జరిగిన రామలింగేశ్వర భవననిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ బోర్డులేక భవన నిర్మాణ కార్మికులు చాలా నష్టపోతున్నారన్నారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు స్పందించి నడకుదురులోని భవననిర్మాణ కార్మికుల సంఘానికి భవనాన్ని నిర్మించి ఇవ్వాలని ఆయన కోరారు. ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడే రోజున ఏఐటీయూసీ అనుబంధ సంఘాలతో కలిసి జెండా ఆవిష్కరణ, సమావేశాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రసాద్ కోరారు. రామలింగేశ్వర భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు ముమ్మిడి అచ్చయ్య, ఎం.అర్జునరావు, వి.శ్రీనివాస్, ఎ.శ్రీమన్నారాయణ, బి.పాపారావు పాల్గొన్నారు.

చురుగ్గా విశ్రాంతి షెడ్డు నిర్మాణ పనులు

- నెలాఖరు పూర్తి చేసేలా చర్యలు
- అధికారులు, కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేసిన ఈఓ



విశ్రాంతి షెడ్డు స్తంభాలు నిలబెట్టి పైకప్పు వేయడానికి ఏర్పాటు చేసిన బీమ్స్



చెట్ల నీడన బస్సుల కోసం వేచి ఉన్న భక్తులు

అన్నవరం: సత్యదేవుని సన్నిధికి పశ్చిమ రాజగోపురం మార్గం ద్వారా వచ్చే భక్తుల సౌకర్యార్థం వై జంక్షన్ సమీపంలో నిర్మిస్తున్న విశ్రాంతి షెడ్డు పనులు ఎట్టకేలకు వేగం పుంజుకున్నాయి. నాలుగు నెలలుగా ఈ పనులు నత్తనడకన జరుగుతున్న విషయం తెలిసిందే. శరవేగంగా జరగాల్సిన పనులు ఆలస్యం కావడంతో దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు పనులను వేగవంతం చేశారు.

రూ.18.56 లక్షలకు టెండరు ఖరారు

పశ్చిమ రాజగోపురం ఎదురుగా గల 30 వీఐపీ పార్కింగ్ స్థలం వద్ద భక్తులు వాహనాలు దిగి సత్యదేవుని ఆలయానికి వస్తారు. ఇక్కడ ఎటువంటి షెల్టర్ లేకపోవడంతో భక్తులు ఎండకు ఎండి, వానకు తడుస్తున్నారు. ఇక్కడ షెల్టర్ నిర్మించాలని చాలా కాలంగా భక్తులు కోరుతుండడంతో దేవస్థానం ఎట్టకేలకు షెల్టర్ నిర్మాణానికి రంగం సిద్ధం చేసింది. రూ.23.73 లక్షలతో విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి టెండర్లు పిలవగా 21.87 శాతం తక్కువకు రూ.18.56 లక్షలకు దాఖలైన టెండర్‌ను గత నెల 30న దేవస్థానం ధర్మకర్తల మండలి ఆమోదించింది. వెంటనే పనులు ప్రారంభించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

ఇప్పటివరకూ నత్తనకడకన

భక్తుల సౌకర్యార్థం 30 అడుగుల వెడల్పు, 50 అడుగుల పొడవు గల షెల్టర్ నిర్మాణానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. డిసెంబర్ నెలాఖరున పనులు ప్రారంభించారు. ఈ రోడ్డు మీదుగా రాకపోకలు నిలిపివేశారు. అప్పటి నుంచి పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిబంధనల ప్రకారం మార్చి నెలాఖరుకు పనులు పూర్తి కావల్సి ఉండగా ప్రస్తుతం ఏప్రిల్ రెండో వారం వచ్చినా ఇంకా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం షెడ్డు పైకప్పు నిర్మాణానికి ఐరన్ పిల్లర్స్ వెల్డింగ్ పనులు జరుగుతున్నాయి.

పెరగనున్న భక్తుల రద్దీ

ప్రస్తుతం వైశాఖ మాసం కారణంగా దేవస్థానానికి భక్తుల రద్దీ పెరగనుంది. దీనికి తోడు 30వ తేదీ నుంచి సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మే ఒకటో తేదీన సత్యదేవుని దివ్యకల్యాణం జరుగనుంది.

మే 11 నుంచి పెద్ద సంఖ్యలో వివాహాలు జరుగుతాయి. వేలాది మంది భక్తులు రత్నగిరికి వస్తారు. అప్పటికి కూడా ఈ షెల్టర్ పనులు పూర్తికాకపోతే భక్తులకు ఇబ్బందులు తప్పవు. కాగా మరో వారం రోజుల్లో పనులు పూర్తి చేస్తామని ఇంజినీరింగ్ డీఈ పి.గురురాజు తెలిపారు.

రత్నగిరిపై సూర్యనమస్కారాలు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో ఆదివారం సూర్యనమస్కారాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు చేసి వివిధ భంగిమల్లో సూర్యనమస్కారాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పండితులు ఆకొండి కృష్ణశర్మ, నాగాభట్ల కృష్ణ, రాందాసు తదితరులు పాల్గొన్నారు.



సూర్యనమస్కారాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేస్తున్న పండితులు